అచ్చెన్న అధ్వర్యంలో తేదేపాలో చేరిన వైకాపా కుటుంబాలు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలము రుంకుహనుమంతుపురం గ్రామానికి చెందిన పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. రాష్ట్ర తెదేపా అధ్యక్షులు, టెక్కలి నియోజక వర్గం శాసనసభ్యులు శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో రుంకు హనుమంతుపురం గ్రామానికి చెందిన టంకాలరాజు, టంకాల రాజాబాబు, టంకాల మహేష్, టంకాల రాము, కరుసోది అప్పలనాయుడు, కర్రి శ్రీను, చిగురువలస నరసింహమూర్తి, టంకాల తాతారావు, బొడ్డ జగన్నాయకులు, కర్రి లక్ష్మణ, చల్ల రోబో తో పాటు కుటుంబాలు తెదేపా పార్టీలో చేరారు. తేదేపా పార్టి నుంచి వైకాపా పార్టీ లోకి చేరిన వారికి అచ్చెన్నాయుడు తెలుగుదేశం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారితో పాటు సంతబొమ్మాళి మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జీరు భీమారావు, మాజీ పిఎసియస్ ఛైర్మన్ అట్టాడ రాంప్రసాద్, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు టంకాల రామారావు, కృష్ణమూర్తిలు ఉన్నారు.

భోగి మంటల్లో జీఓ-1 కాపీలు

ఈ అరాచిక ప్రభుత్వం పోవాలి : మాజీ ఎమ్మెల్యే కలమట

విశాలాంధ్ర-కొత్తూరు : గడిచిన నాలుగున్నర ఏళ్లుగా అరాచక పాలన సాగిస్తూ ప్రశ్నించే వారిపై కేసులు లు పెట్టి వేధిస్తున్న వైసీపీ ప్రభుత్వం పోవాలని మాజీ ఎమ్మెల్యే, పాతపట్నం టీడీపీ ఇంఛార్జి కలమట వెంకటరమణ అన్నారు. మండలం మాతల స్వగ్రామంలో గ్రామస్తులతో కలిసి భోగి పండగ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. రాజకీయ స్వేచ్ఛను హరించే ప్రభుత్వ జీఓ వన్ కాపీలను మాజీ ఎమ్మెల్యే కలమట ఆయన అనుచరులు భోగి మంటల్లోవేసి తగలబెట్టారు వైసీపీ ప్రభుత్వానికి ఇదే చివరి సంక్రాంతి అని ఆయన అన్నారు. ఈ ప్రభుత్వంలో ఏఒక్క వర్గానికి మేలు జరిగలేదు అన్నారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి గద్దె దించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. అని మాజీ ఎమ్మెల్యే కలమట అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి కలమట సాగర్ తదితరులు పాల్గొన్నారు.

వస్త్రాలు పంపిణీ

విశాలాంధ్ర-రణస్థలం : ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం మండలం, రణస్థలం గ్రామం లో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఆర్గనైజేషన్ సెక్రెటరీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు మరియు రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీ నాయుడు కుటుంబ సభ్యులు, పంచాయతీ పెద్దలు మధ్య ప్రతీ ఏడాది మాదిరిగానే ఈ ఏడాది పేదలకు కొత్త బట్టలు వారి తల్లిదండ్రుల చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మజ్జి వెంకట రమణ, వార్డ్ మెంబర్లు కరిమజ్జి చంద్రినాయుడు, పెద్దింటి చిన్నారావు, లంక రామారావు, కేలం వెంకటరమణ, కరిమజ్జి గోవిందరావు, పిన్నింటి పైడితల్లి పాల్గొన్నారు.

రణస్థలం మండలం, వెంకట్రావుపేట గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త కోట్ల లక్ష్మునాయుడు దంపతులు సంక్రాంతి సందర్భంగా సుమారుగా 100 కుటుంబాలకు వస్త్రాలను పంపిణీ చేశారు. దన్నాన పేటలోవైసీపీ నాయకులు దన్నాన సీతారాం గ్రామంలో 300 మందికి పంపిణీ చేశారు. డి శ్రీరాములు, బలరాం, పిన్నింటి రామారావు, పిన్నింటి నీలకంతం, పిన్నింటి రంగారావు, పిన్నింటి రమణ, పిన్నింటి సత్యారావు, పిన్నింటి కొండలరావు, పిన్నింటి అప్పలనాయుడు పిన్నింటి ప్రసాద్, పిన్నింటి కృష్ణ, వాళ్ల రమణ, లంక రమణ, పిన్నింటి ప్రకాష్, పిన్నింటి నవీన్, పిన్నింటి వెంకటేష్, అప్పారావు, సీతారాము, మోహన్ అయ్యప్ప కుర్ర వరప్రసాద్ యువత యూత్ పెద్దఎత్తున గ్రామీణ పేదలందరూ పాల్గొన్నారు.

దాతల సహకారం ఎంతో అవసరం

విశాలాంధ్ర-కవిటి : నిరుపేద కుటుంబానికి ఆదుకునేందుకు దాతల సహకారం ఎంతో అవసరమని కపాసుకుద్ధి యువజన సంఘ సభ్యులు అన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని సీమురు గ్రామానికి చెందిన శివంగి దివాకర్(37) దురదృష్టవశాత్తు కేరళ లోని ప్రొక్లైన్ ప్రమాదంలో మృతి చెందాడు. మృతునికి భార్య లత ఇద్దరు పిల్లలు ఉన్నారు. దివాకర్ కుటుంబం కటిక పేదవారు కావడంతో దాతలు సహకారం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ సందర్భంగా కపాసుకుద్ధి యువజన సంఘ సభ్యులు ఎన్నారైలు 40వేల రూపాయలు దివాకర్ కుటుంబ సభ్యులుకు ఆర్థిక సహాయం అందజేశారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి సహాయాన్ని అందించాలని యువజన సంఘ సభ్యులు కోరారు. ఆర్థిక సహాయాన్ని అందజేయ దలచినవారు ఫోన్ పే నంబర్ గురుమూర్తి 9701840110 నెంబర్‌కు ఫోన్ పే చేయాలని కోరారు.

సందడిగా భోగి పండుగ

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: భోగి పండుగ సందర్భంగా ఎపి హెచ్ బి కోలని లో కోలనీ వాసులు ఆదివారం ఉదయం భోగి మంటలు వేసి సంతోషాన్ని వ్యక్త పరిచారు. భోగి పండుగను జరుపు కోవడానికి, ప్రజలు తమ పాత వస్తువులను విస్మరించి, కొత్త శకానికి నాంది పలికారు. ఇళ్ళు శుభ్రం చేసి బంతి పువ్వుల దండలు, మామిడి ఆకులు మరియు అనేక కొత్త వస్తువులతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో కోలని పెద్దలు జి. కృష్ణా, కోదండ, డి వి టి రాజు, రాజు నాగేశ్వరరావు, ఆషా దీపికా ప్రవీణ్, లావణ్య, మాలిని. భారతి, గౌతం. అగస్టయ్య, గీతిక, నీతు, సంజునా, దాక్షా, లిప్పీ తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : ఆమదాలవలస పట్టణంలో భోగి పండుగను వీధుల్లో సందడిగా ఆదివారం జరిపారు. వేకువజాము నాలుగు గంటల నుంచి వేశారు భోగి మంటలు వేశారు. పట్టణంలోని పలు వీధుల తోపాటు భవిత మోడల్ స్కూల్‌లో కూడా భోగి పండుగను ఘనంగా నిర్వ హించారు. చిన్నారులకు భోగి పాలు పోసి ఆయుష్ పెంపొందించేందుకు దీవించారు. భోగి మంటలలో చలి కాగుతూ యువత కేరింతలు వేశారు. పాఠశాల యాజమాన్యం విద్యార్థులు తదితరులు భోగి పండుగ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కవిటి : మండలంలోని ప్రజలు భోగి పండగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈమేరకు ఆదివారం భోగి పండగ వేడుకలు పురస్కరించుకొని గ్రామాలలో భోగి మంటల కాంతులు విరజిమ్మాయి. తమ కష్టాలను తొలగించాలని ప్రజలు అగ్ని దేవుడిని ప్రార్థించారు. తెల్లవారుజాము నుంచే భోగి మంటలతో ఇండ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేస్తూ చిన్నాపెద్దా తేడా లేకుండా సందడి చేశారు. దక్షిణాయనంలో పడ్డ కష్టాలు,బాధలను భోగి మంటల రూపంలో అగ్ని దేవుడికి సమర్పించి రాబోయే ఉత్తరాయణ కాలంలో సుఖసంతోషాలను ప్రసాదించాలనే పరమార్ధమే భోగి పండుగ విశిష్టత. ఈ భోగి పండుగ వస్తూవస్తూ ఏడాదికి సరిపడా ధాన్యాన్ని వెంటతెస్తుంది. భోగ భాగ్యాలు ప్రసాదించే పండుగతోనే సంబరాలు మొదలవుతాయి. గ్రామాలలో భోగి పండుగ సందర్భంగా యువత ఆనందోత్సవాలతో జరుపుకున్నారు.

20 బస్తాల ధాన్యం దగ్ధం

విశాలాంధ్ర-పలాస : పలాస పెద్దవీధికి చెందిన తెలుకుల రాసమ్మకు చెందిన 20 బస్తాల ధాన్యం ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. పలాస సీతమ్మగుడి సమీపంలో రాసమ్మకు చెందిన 2 ఎకరాల పొలం ఉంది. పండించిన ధాన్యాన్ని పొలంలో ఉంచగా ప్రమాదవశాత్తు ఒక్కసారిగా ధాన్యం బస్తాలు కాలిపోవడంతో స్థానికులు రాసమ్మకు సమాచారం అందించారు. కాలిపోతున్న ధాన్యం బస్తాలను ఆపేందుకు ఎంత ప్రయత్నించినప్పటికీ కాలి బూడిదైంది. అనంతరం పలాస అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని కాలిపోతున్న ధాన్యం బస్తాలను ఆర్పివేశారు. ఈ అగ్నిప్రమాదంలో సుమారు 30 వేల రూపాయలు ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

తొలితరం కమ్యూనిస్టు యోధుడు, ఉద్యమ నేత 'మార్పు'

సీపీఐ నాయకులు చాపర సుందర్‌లాల్

విశాలాంధ్ర-పలాస : తొలి తరం కమ్యూనిస్టు, రైతాంగ ఉద్యమనేత కామ్రేడ్ మార్పు పద్మనాభం అని సిపిఐ నాయకులు చాపర సుందర్‌లాల్ అన్నారు. ఆదివారం మార్పు వర్ధంతి సందర్భంగా పలు వామపక్ష నాయకులతో కలిసి ఆయన విగ్రహనికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సుందర్‌లాల్ మాట్లాడుతూ మందస మండలం భిన్నాల మదనాపురంలో 1896 సంవత్సరంలో జన్మించారని మందస పలాస ప్రాంతాల రైతులు జమీందారు పాలనలో తీవ్ర ఇబ్బందులు గురయ్యారని బ్రిటిష్ పాలకులు పది రూపాయలు శిస్తూ వేస్తే జమీందారులు 100 రూపాయల వసూలు చేయడం తో వ్యతిరేకంగా1920లో సహాయ నిరాకరణ ఉద్యమం నుండి మార్పు తాత ఉద్యమ జీవితం మొదలైందని గుర్తు చేశారు. బ్రిటిష్ వారు పాలన సౌలభ్యం కోసం జమీందారు వ్యవస్థను ఏర్పాటు చేసుకుని వారి నుండి కప్పం కట్టించుకునేవారన్నారు. జమీందారులు రైతులను పీడించి అనేక విధాలుగా ఇబ్బందులు గురి చేసేవారన్నారు. అడవుల మీద హక్కులు ఆదివాసీలకు లేకుండా రైతులకు భూమి మీద హక్కు లేకుండా పండించే వారికి పంట మీద హక్కు లేకుండా సర్వహక్కులన్నీ జమీందారులు, మోకాశాదారులు కర్ణాలు నాయుడు ప్రజల బానిసలుగా బతుకుతున్న రోజులవి. రైతులు జీవస్యవాలుగా జీవించడం తప్ప చేయగలిగిందేమీ లేని స్థితిలో అలాంటి కష్టకాలంలో రైతులు సమస్యల పైన జమీందారులకు వ్యతిరేకంగా అధిక శిస్తు కట్టవద్దని రైతులు పక్షాన మార్పు పద్మనాభం తాతగారు నిలబడి పోరాడారని అన్నారు. ఆ క్రమంలో రామకృష్ణారావు గారితో పరిచయం ఏర్పడి పలాసకు చెందిన ఆయన కాంగ్రెస్ వాదిగా ఉండేవారు. ఆయన జాతీయోద్యమంలో పాల్గొనేవారు. ఆయనతో పాటు మార్పు పద్మనాభం కూడా సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. 1927 లో మహాత్మా గాంధీ ఇచ్ఛాపురం పుల్లల శ్యామసుందర్ ఇంటి వద్ద బస చేస్తున్న సందర్భంగా గాంధీని చూడడానికి వేలాది మంది ప్రజలు ఇచ్ఛాపురం చేరుకున్నారని, మార్పు పద్మనాభం ఆయన స్నేహితులైన బెందళం గౌరయ్య, గానుగుల తరుణాచరులతో కలిసి ఆయన ఇచ్ఛాపురం వెళ్లి గాంధీని చూశారన్నారు. తర్వాత పుల్లలు శ్యాంబాబుతో రైతు ఉద్యమంలో కలిసి పని చేయడానికి తన సంసిద్ధత వ్యక్తం చేశారని అలా ఆయనతో పాటు రైతు ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. శ్యామ్ బాబు మద్రాస్ రాష్ట్రంలో గుర్తింపు పొందిన నాయకుడని ఎన్జీ రంగా తో పాటు ఆయన రైతు సంఘం ఉద్యమాలు నడిపించేవారు. గౌతు. లచ్చన్న అధ్యక్షుడుగాను, మార్పు. పద్మనాభం ను కార్యదర్శులు నియమించారని అన్నారు. మందస జమిందార్ సిస్తులు వసూళ్ల గ్రామాల్లో జరగడంలేదని జమీందారుల మీద ప్రజలకు మార్పు పద్మనాభం రెచ్చగొడుతున్నాడని అభియోగంతో ఆయనను అరెస్టు చేసే కడలూరు జైల్లో పెట్టారు. 1933లో ఆయన కడలూరు జైల్లో ఉంటూ అక్కడ కమ్యూనిస్టు పార్టీ బీజం పడిందని 1940 ఫిబ్రవరి చివరి నాటికి ఆయన విడుదలయ్యారని తెలిపారు. అఖిల భారత కిసాన్ మహాసభ పలాసలో జరపాలని పుల్లల శ్యాంసుందర్రావు గారు ప్రతిపాదించగా దానికి కిసాన్ మహాసభ ఆమోదం తెలిపి 1940 మార్చి 23 నుండి 29 వరకు జరపాలని కిసాన్ మహాసభ తీర్మానించిందని ఫిబ్రవరి నాటికి విడుదలైన పద్మనాభం మార్చిలో జరుగుతున్న మహాసభల ఏర్పాట్లు నిమగ్నమయ్యారన్నారు. ఐదు దశాబ్దాలు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జమీందారులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పాలకులు రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు పద్మనాభం ఆయన అనేక సందర్భాల్లో జైలు జీవితం గడిపారు ఆయన కుటుంబం అనేక కష్టాలకు గురైంది మధ్యలో భార్య మరణించింది అనేక ఇబ్బందులు ఆటంకాలు అధిగమించుకుంటూ ప్రజల మీద విశ్వాసంతో ప్రజా ఉద్యమంలో రైతు ఉద్యమంలో ఆయన రాటు దేలిన యోధుడు ఆయన నిష్పక్షపాతంగా నిష్కలంగా రైతు పక్షపాతి అని అన్నారు. 19 66 జనవరి 14న తన స్వగ్రామం భిన్నాల మదనాపురంలో ఆయన అమరుడయ్యారన్నారు. తొలితరం కమ్యూనిస్టు రైతు ఉద్యమ నాయకుడు నిరంతరం జైల్లో మగ్గుతూ జమీందారుల వేధింపులు మధ్యన మక్కువ దీక్షతో ఐదు దశబ్దాలు రైతు ఉద్యమానికి అంకితమైన ఆయన జీవితం ఆదర్శం ఆచరణీయం ఆయన చరిత్ర మట్టి పొరల కింద కప్పబడ్డదని అన్నారు. ప్రముఖ చరిత్ర పరిశోధకులు డాక్టర్ ముఖ్యం చరిత్ర శకలాలను తవ్వి కామ్రేడ్ మార్పు పద్మనాభం చరిత్రను చాలా వివరాలతో ప్రజల ముందు ఉంచారని, మన కళ్ళ ముందు మన పూర్వీకుల సాహసోపేతమైన వీర గాధలను చరిత్రను మననం చేసుకుందామని వారి వారసత్వాన్ని పుణికి పుచ్చుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో వంకల మాధవరావు, చాపర వేణుగోపాల్, వంకల ముకుంద, మద్దిల మల్లేశ్వరరావు, మద్దిల రామారావు, జుత్తు వీరాస్వామి, రవి తదితరులు పాల్గొన్నారు.

21న జిల్లా మ్యాచ్‌లకు ఎంపైర్ల, స్కోరర్ల ఎంపిక

విశాలాంధ్ర-అరసవల్లి : జిల్లాలో నిర్వహించనున్న పలు క్రికెట్ టోర్నమెంట్‌లకు అంపైర్ల టెస్ట్ ఎంపికను ఈనెల 21న ఎంపిక నిర్వహించనున్నట్టు జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షులు శాస్త్రి, ప్రధాన కార్యదర్శి హసన్‌రాజా తెలిపారు. ఈ మేరకు వారు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 21న ఆర్ట్స్ కళాశాల మైదానంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యాలయానికి ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు. అభ్యర్థులకు డిగ్రీ ఉత్తీర్ణత సాధించి, 25 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారై ఉండాలన్నారు. క్రికెట్‌పై పూర్తిస్థాయి అవగాహన, పరిజ్ఞానం కలిగి వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్లకు కూడా పంపిస్తామని తెలిపారు. అలాగే స్కోరర్లు కూడా అదే రోజు ఎంపిక ఉంటుందని, అభ్యర్థులకు డిగ్రీ ఉత్తీర్ణత సాధించి, 25 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారై ఉండాలన్నారు. క్రికెట్‌పై పూర్తిస్థాయి అవగాహన, పరిజ్ఞానం కలిగి వారు అర్హులన్నారు. ఇతర వివరాలకు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి హసన్ రాజా 8247264245 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

క్రీడాస్ఫూర్తిని నింపేందుకే ఫ్రెండ్లీ మ్యాచ్

- పాత, కొత్త తరం క్రికెటర్ల మేలికలయిక
- ఆనవాయితీని కొనసాగించిన జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధులు
- జిల్లా క్రికెట్ సంఘం సెక్రటరీ హసన్‌రాజా

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : జిల్లా క్రికెటర్లలో క్రీడాస్ఫూర్తిని నింపేందుకే ప్రతీ ఏడాది బోగి రోజున పాత, కొత్త తరం క్రికెటర్ల మేలికలయికతో ఫ్రెండ్లీ మ్యాచ్ నిర్వహిస్తున్నామని జిల్లా క్రికెట్ సంఘం సెక్రటరీ హసన్‌రాజా తెలిపారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆదివారం భోగిని పురస్కరించుకొని గత 40 ఏళ్లుగా కొనసాగుతున్న ఆనవాయితీని కొనసాగిస్తూ ఫ్రెండ్లీ మ్యాచ్ నిర్వహించారు. ముందుగా దివంగత క్రికెటర్లు డాక్టర్ జీవీ రాజారెడ్డి, మీర్ మహ్మద్, ఓరుగంటి కమలాకర్, బత్తుల రమణ, ఇషాక్ మహ్మద్, టీఎంఎస్ ప్రకాష్ అలియాస్ ముని తదితరులకు నివాళులు అర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం హసన్‌రాజా మాట్లాడుతూ ప్రతీ ఏడాది భోగి రోజున పాత, కొత్త తరం క్రికెటర్లందరూ కలసి ఆటలాడడం 40 ఏళ్లుగా ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆ ఆనవాయితీని కొనసాగిస్తూ ఫ్రెండ్లీ మ్యాచ్ నిర్వహించామన్నారు. జిల్లాలో ఈ ఏడాది క్రికెట్‌ను అందరి సహకారంతో ఎంతో అభివద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది సీనియర్ జట్టు నార్త్‌జోన్ ఫైనల్‌లో విశాఖపట్నంపై గెలుపొందడం గొప్ప అనుభూతి అని తెలిపారు. రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు సహకారంతో క్రికెట్ అభివద్ధికి అనేక ప్రణాళికలు వేస్తున్నామని వివరించారు. ఎంఓయు కూడా చేశామని చెప్పారు. జాయింట్ కలెక్టర్ నవీన్ సౌజన్యంలో ఫెడ్‌లైట్లు, నెట్‌లను కూడా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ మ్యాచ్‌లో జిల్లా క్రికెట్ సంఘం సెక్రటరీ జాయింట్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్, వీ. మధుసూదన్, సీనియర్ క్రికెటర్, మెంటర్ ఇలియాజ్ మహ్మద్, అండర్ -16 జట్టు కోచ్ మేఘనాథ్, కొట్టిశ కిరణ్, ఎంవీ రమణ, జిల్లా క్రికెట్ సంఘం యోగా కోచ్ బెండి సురేష్, సీనియర్ క్రికెటర్లు జీమా, బద్రిగిరి వసంత్, జీఎస్ ఎస్ ప్రసాద్, విజయభాస్కర్, ఆంధ్రా అసోసియేషన్ మాజీ కోచ్ కె ఆదర్శన్, వై. ఉమామహేశ్వరరావు, పొందూరు జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ వై. ఉమామహేశ్వరరావు, సీనియర్ క్రికెటర్ బద్రిగిరి మురళీధర్ కుమార్, జిల్లా అసోసియేషన్ మాజీ సెక్రటరీ ఉరెన్ హక్, వీవీఆర్ ఎస్. మూర్తి అలియాస్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోటలో టీడీపీలో 100 కుటుంబాలు చేరిక

విశాలాంధ్ర-సరుబుజ్జిలి : సరుబుజ్జిలి మండలంలోని కొత్తకోట గ్రామంలో వైసిపి సర్పంచ్ సురవరపు జగదీశ్వరరావు 100 కుటుంబాలతో శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు మరియు టిడిపి పార్లమెంటరీ అధ్యక్షులు కూన రవికుమార్ ఆధ్వర్యంలో టిడిపిలో కలిశారు. కార్యక్రమంలో రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని నమ్మి రేపటి భారత భవిష్యత్తు తీర్చిదిద్దడం కోసం తమ వంతు భాగస్వామ్యాన్ని అందిస్తున్న కొత్తకోట గ్రామస్తులకు ధన్యవాదాలు తెలియజేశారు. జగన్మోహన్ రెడ్డి నేను మీ బిడ్డనంటూ ప్రచారం చేసుకుంటున్నారని దాని ఉద్దేశం ఆ కుటుంబాన్ని తీర్చిదిద్దాలని కాదని, కేవలం ఆ పేరుతో మీ ఆస్తులు దోచుకోవడానికే అనే విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలని అన్నారు. అలాంటి దురుద్దేశం ఉండటంవల్లే కొత్త భూచట్టాన్ని తెచ్చి మీఆస్తులన్నీ తన గుప్పెట్లో ఉంచుకోవాలని చూస్తున్నారని అన్నారు. జిల్లాలో టిడిపిలో చేరికలు నేటి నుండి మొదలయ్యాయని, భోగిరోజు మొదలైన ఈ చేరికలు ఎలక్షన్ వరకు సాగుతూ ఉంటాయని తెలియజేశారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో ఎటువంటి అభివృద్ధి లేక ప్రజలు విసిగి, వేసారి పోయారని జగనాసురుడుకు-ప్రజాపాలవుడికి మధ్య వ్యత్యాసం నేటికి ప్రజలకు తెలిసిందని, వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మే పరిస్థితులు లేవని ఎద్దేవా చేశారు. ముందుగా రవికుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో మరో శకం మొదలు కాబోతుందని అన్నారు. ఒక్క ఛాన్స్ అంటే ప్రజల అవకాశం ఇచ్చారని ఈ అవినీతి పరిపాలన చూశాక ప్రజలకి మరో ఛాన్స్ ఇచ్చే ఆలోచన లేదని పేర్కొన్నారు. మద్యం నిషేధం చేస్తామని మద్యమమ్ముకునే రాష్ట్ర నడుపుతున్నారని ఎద్దేవా చేశారు. సామాన్యుడు ఇల్లు కట్టుకోవాలంటే భయపడుతున్నాడని, బంగారమైన కొనొచ్చు గాని ఇసుక కొనడం కష్టతరమైందని పేర్కొన్నారు. కొత్తకోట గ్రామస్తులకు భోగి మరియు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పిరుకట్ల శివప్రసాద్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శివాల సూర్యనారాయణ, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు నందివాడ గోవిందరావు, స్థానిక నాయకులు మరియు మండల టిడిపి అధ్యక్షులు అంబాల రాంబాబు, కూన గణపతి రావు, గురువు తిరుమలరావు మరియు మండల టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ప్రియాగ్రహారంలో కళాకారుల సందడి

విశాలాంధ్ర-పోలాకి : సంక్రాంతి సందర్భంగా ప్రియాగ్రహారంలో కళాకారుల సందడికార్యక్రమం జరుగునున్నట్లు సర్పంచ్ బేవర నూకరాజు తెలిపారు. నేటి ఉదయం 8:30 గంటలకు బస్తాలు ఎత్తే పోటీ జరగనుందని పోటీదారులు ప్రవేశ రుసుంగా రూ. 20/- చెల్లించి పోటీలో పాల్గొనేందుకు అర్హులన్నారు. మాజీ సర్పంచ్ లావేటి కృష్ణారావు మాట్లాడుతూ మధ్యాహ్నం కళాకారుల సందడి 2గంటలకు జరుగుతున్నట్లు చెప్పారు. కార్యక్రమం ప్రియాగ్రహారం శ్రీశ్రీశ్రీ త్రిపురాంతక విశ్వేశ్వర స్వామి వారి ప్రాంగణ పరిధిలో డోలు సన్నాయి (కచేరి) కార్యక్రమం జరగనుందని కావున కార్యక్రమం విజయవంతం చేయవలసిందిగా వారు కోరారు. మిగతా వివరాలకు 9492265768 9110384564 సంప్రదించాలని విజేతలకు సందడి కార్యక్రమం అనంతరం బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

జాతీయ స్థాయి పోటీల్లో కిరణ్‌కుమారి ప్రతిభ

విశాలాంధ్ర-సోంపేట : జాతీయ స్థాయి బీచ్‌గ్రాప్లింగ్ పోటీల్లో ఈ మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన లండ కిరణ్‌కుమారి ద్వితీయ స్థానం కైవశం చేసుకొని సత్తాచాటింది. విశాఖపట్నంలో ఇటీవల జరిగిన ఈ పోటీల్లో అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. కిరణ్‌కుమారి ప్రతిభ పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భోగి సంకల్ప వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర-జలుమూరు: భోగి సందర్భంగా సారవకోట పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భోగి-సంకల్ప వేడుకలకు మాజీ శాసన సభ్యులు - ఇన్‌చార్జ్ బగ్గు రమణమూర్తి కి మంగళధ్వనులు, గిరిజన నృత్యాలతో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ఘన స్వాగతం పలికారు. అనంతరంఏర్పాటు చేశిన వేడుకల్లో పాల్గొని భోగి మంటను వెలిగి, కీడు తొలగాలి ఏపీ వెలగాలి అని నినాదంతో వైసీపీ ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి 2019-2024 మధ్య కాలంలో దుర్మార్గపు చట్టాలను చట్టపత్రాలను భోగిమంటల్లో వేసి దగ్నం చేయడం జరిగింది రాష్ట్రంలో మరియు నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో సైకో పాలన ను భోగిమంటల్లో వేసి ప్రతి ఒక్కరూ కూడా తగలబెట్టాలని అన్నారు. ఈ దుర్మార్గాలని భోగి మంటల్లో కాలిపోవాలి అని రాష్ట్రాన్ని దుష్టపాల నుంచి విడిపించి ప్రజాస్వామి పరిరక్షణకు ప్రతి ఒక్క పౌరుడు కూడా కంకణం కట్టుకోవాలని కోరారు అలాగే నియోజకవర్గ ప్రజలకు, తెలుగుదేశం పార్టీ శ్రేణులకు ముందుగా సంక్రాంతి శుభాకాంక్షలుతెలియజేశారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో పాల్గొణి గొలుపొందిన వారికీ బహుమతులు రమణమూర్తి, ధర్మాన తేజ్ కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి ధర్మాన్ని తేజ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ, క్లస్టర్ ఇంచార్జ్ సురవరపు తిరుపతిరావు, వెలమల రాజేందర్ నాయుడు, దుంగ స్వామి బాబు, నియోజకవర్గ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చోరీ జరిగిన ఇంటిని ఏఎస్పీ, డిఎస్పీ పరిశీలన

విశాలాంధ్ర-జలుమూరు : మండలంలోని తిమడాంలో టీచర్ ప్రసాదరావు ఇంట్లో భారీ చోరీ జరిగిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఏఎస్పీ, డిఎస్పీ వారి ఇంటిని పరిశీలించారు. తన కుటుంబసభ్యులతో కలిసి ఇటీవల తీర్థయాత్రలకు వెళ్లి, తిరిగి ఆదివారం ఇంటికి చేరుకోగా..30 తులాల బంగారం, 4 కేజీల వెండి, రూ.50 వేల నగదు దొంగిలించబడిందని ఏఎస్పీ, డిఎస్పీలకు తెలిపారు. క్లూస్ టీం ఆధారంగా దర్యాప్తు చేసి, వీలైనంత తొందరగా దుండగులను పట్టుకుంటామన్నారు.

యూపీఎస్సీ విజేతకు సన్మానం

విశాలాంధ్ర-సోంపేట : యూపీఎస్సీలో 65 ర్యాంకు ఆల్ ఇండియా స్థాయిలో సాధించిన జూనియర్ జుయాలజిస్టుగా గ్రేడ్-1 ఉద్యోగానికి ఎంపికయిన పలాసపురంకు చెందిన ఎన్. పవన్ కుమార్ ఆదివారం సోంపేటకు చెందిన స్వచ్ఛంధ సంస్థ శ్రీశయన చైతన్య దీపిక ఘనంగా సన్మానించింది. పవన్ సాధించిన అసమాన్య ప్రతిభను అభినందిస్తూ దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పల్లెటూరిలో పేద కుటుంబంలో జన్మించి క్రమశిక్షణ పట్టుదలతో చదువుతూ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విజేతగా నిలిచిన పవన్ యువతకు ఆదర్శనీయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు దేవాడ మోహనరావు, కార్యదర్శి దుద్ది వీర్రాజు, సంస్థ ప్రతినిధులు బీన ఆనందరావు, దుద్ది శ్రీనివాస్, దుద్ది లక్ష్మీనారాయణ, పొడుగు కామేష్, దుద్ది బాలరాజు, బల్ల జానకిరావు, దూగాన లోకనాథం, పల్ల పాపారావు తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో ఆలయాల అభివృద్ధి

విశ్రాంత డిఎస్పీ ఎస్‌వివి ప్రసాదరావు

విశాలాంధ్ర-కవిటి: దాతలు అందరు సహకారంతో మండలంలోని పలు ఆలయాలు అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు విశ్రాంత డి ఎస్పీ ఎస్ వి వి ప్రసాదరావు అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని కవిటిలో నూతనంగా నిర్మాణ పనులు చేపడుతున్న వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణము కొరకు 50 వేల రూపాయలు నగదును కంచరాల రోహన్ కుమార్ విరాళంగా జగతి ఆంజనేయస్వామి ఆలయం వద్ద కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా జగతి గ్రామస్తులు విశ్రాంత డి.ఎస్.పి ప్రసాదరావు కు అలాగే రోహన్ కుమార్ కు శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డి బాబురావు,భావన నారాయణమూర్తి, బిపి రెడ్డి, సీతాలతో పటు గ్రామస్తులు పాల్గొన్నారు.

మానవ సంబంధాలను గౌరవించాలి

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : మానవ సంబంధాలను ప్రతీ ఒక్కరూ గౌరవించాలని బదిలీపై వెళుతున్న కాశీబుగ్గ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. శంకర్‌రావు అన్నారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఎస్సై వై. మధుసూధనరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ ప్రజలు పోలీస్‌లను గౌరవిస్తారని అన్నారు. ఈసందర్భంగా తనకు సహకరించిన డిపార్ట్మెంట్ వారిని ప్రజలను పత్రికా ముఖంగా ధన్యవాదాలు తెలిపారు. పోలీస్ అధికారులు కోర్టు తీర్పులను అధ్యయనం చేయాలని సూచించారు. ఏ ఒక్కరినీ కించపరిచేలా వ్యవహరించ కూడదు అన్నారు. విధులు నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లు ను సామరస్యంగా ఎదుర్కోవాలి అన్నారు. సన్మాన గ్రహీత నుద్దేశించి పలువురు మాట్లాడుతూ ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు కోరాయి గోపి కృష్ణ, బొత్స షణ్ముఖరావు, ఏఎస్సై జిన్నరావు, సిబ్బంది పాపారావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, జగన్, కోటి తదితరులు పాల్గొన్నారు.

17న కనుగులవలసలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-ఆమదాలవలస : మండలంలోని కనుగులవలస గ్రామంలో ఈనెల బుధవారం 17వ తేదీన రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు డిసిసిబి డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు ఆదివారం తెలిపారు. డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు, కనుగులవలస మాజీ సర్పంచ్ బొడ్డేపల్లి రామజోగి నాయుడు శత జయంతి ఉత్సవాలలో భాగంగా బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నామని తెలిపారు. ఆసక్తి గల యువత శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు.

టెన్యూర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ సంఘం ఉపాధ్యక్షునిగా కృష్ణచంద్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టెన్యూర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ సంఘం ఉపాధ్యక్షునిగా జిల్లా ఫ్యామిలీ కోర్టు, మూడో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాన కృష్ణచంద్ ఎన్నికయ్యారు. ఈ నెల 12న గుంటూరులో జరిగిన రాష్ట్ర సంఘం ఎన్నికలలో ఈయన ఎన్నికయ్యారు. కృష్ణచంద్ గతంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, జిల్లా బార్ అసోసియేషన్ న్యూ మిలీనియం అధ్యక్షునిగా, జిల్లా కోర్ట్ స్వర్ణోత్సవ కమిటీ ఛైర్మెన్‌గా, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల అకడమిక్ మెంబర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈయన ఎన్నిక పట్ల జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావుతో పాటు పలువురు హర్షం వ్యక్తం చేశారు.

పేదలకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలంలోగల శ్రీజగన్నాథపురం సర్పంచ్ నూక సత్యరాజు తల్లిదండ్రులు జ్ఞాపకార్థం పేదలకు, వృద్ధులకు ఆదివారం దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుమారు 150 మందికి సంక్రాంతిని పురస్కరించుకొని చీరలు, పంచెలు, దుప్పట్లుతో పాటు కొంత నగదును, భోజనం పంపిణీ చేశారు. ప్రతి యేటా బోగిపండగనాడు తనవంతు సహాయంగా చీరలు, దుప్పట్లు పేదలకు పంపిణీ చేయటం జరుగుతుందని ఆయన తెలిపారు.

విప్లవ రైతాంగ ఉద్యమాలకు నిత్య చైతన్య స్ఫూర్తి మార్పు పద్మనాభం

మార్పు ఆశయ సాధనకు విప్లవించడమే నిజమైన నివాళి : తాండ్ర ప్రకాష్

విశాలాంధ్ర-మందస : 1966 జనవరి 14న అమరత్వం చెందిన రైతాంగ విప్లవ వైతాళికుడు, జాతీయోద్యమ నాయకుడు అమరజీవి మార్పు పద్మనాభం విప్లవ రైతాంగ ఉద్యమాలకు నిత్య చైతన్య స్ఫూర్తిగా నిలిచారనీ, పద్మనాభం అమరత్వం చెంది యాభై ఎనిమిదేళ్ళయినా ఉద్యమాల్లో చెరగని ప్రవహిస్తున్న పోరాట జ్ఞాపకమయ్యారని సిపిఐ (యం.యల్) న్యూ డెమొక్రసీ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ అన్నారు. మార్పు ఆశయ సాధనకు విప్లవించడమే నిజమైన నివాళి అని ఆయన అన్నారు. పోరాట వారసులంతా తాతగా పిలుచుకునే మార్పు పద్మనాభం 58వ వర్ధంతి సందర్భంగా ఆదివారం హరిపురంలో మార్పు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సభనుద్దేశించి తాండ్ర మాట్లాడుతూ శ్రీకాకుళ గిరిజన సాయుధ రైతాంగ పోరాటానికి పద్మనాభం ఆశయాలే ప్రేరణయ్యాయన్నారు. కళింగసీమలో తొలితరం కమ్యూనిష్టాగరిష్ఠుడైన మార్పు కార్యాచరణ రైతాంగ ఉద్యమాలకు నేడు దిక్సూచిలా ఉందన్నారు. పలువురు రైతాంగ ప్రతినిధులు, మార్పు ట్రస్టు సభ్యులూ హాజరైన ఈ సభలో ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ ఖగేశ్వరరావుతో పాటు పలు ప్రజా సంఘాల నాయకులు గొరకల బాలకృష్ణ, రాపాక మాధవరావు, జె. అప్పయ్య , బర్ల గోపి, పోతనపల్లి మల్లిబాబు, ఉగ్రిపల్లి సోమనాథం, కంసు కృష్ణమూర్తి, నల్ల హడ్డి, మామిడి మాధవరావు, దాసరి తాతారావు, పసుపురెడ్డి రాము, వివిరమణమూర్తి, తదితరులు మాట్లాడుతూ పద్మనాభం స్థూపం వద్ద నివాళులు అర్పించారు.

చేతకాని సీఎంను బంగాళాఖాతంలో కలిపేద్దాం

- భోగి మంటలలో జీవోలు దగ్ధం
- రాష్ట్రానికి ఈ భోగితో పీడవదలాలి
- సంక్రాంతి సంబరాల్లో అబ్బాయ్, బాబాయ్‌లు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : నాలుగున్నరేళ్లుగా రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని బంగాళఖాతంలో కలిపేయాలని రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు, టెక్కలి శాసన సభ్యులు కింజరాపు అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం పార్లమెంటు సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడులు అన్నారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయ అవరణలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంబరాల్లో పాల్గొన్న అబ్బాయ్, బాబాయ్‌లు ముందుగా భోగి మంటలను వెలిగించి అందులో ప్రభుత్వం విడుదల చేసిన లోప భూయిష్టంగా ఉన్న భూహక్కు చట్టవథకం, అంగన్వాడీలపై ఎస్మా వంటి పలు జీవోలను భోగి మండలో వేసి దగ్ధంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ముఖ్యమంత్రి 2019లో జరిగిన ఎన్నికల మ్యాన్‌పెస్టోలో ఇచ్చిన హమీలను ఏ ఒక్కటీ నెరవేర్చకపోగా వాటి కోసం ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడం, ఎస్మా ప్రయోగం వంటి జీవోలను విడుదల చేయటం వంటి అనిచివేచే కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ఎన్నడూ లేని విధంగా అన్ని వర్గాల ప్రజలు ఆందోళన బాట పడుతూ తిరుగుబాటు చేస్తున్నారని, ఇంతటి నీచమైన పాలకులను తాము ఎన్నడు చూడలేదన్నారు. ఈ ముఖ్యమంత్రి రేపు రానున్న ఎన్నికల్లో అభ్యార్థుల ఎంపికలో సైతం విఫలమయ్యాడని అందుకే పార్టీకి నమ్ముకున్న లాంటి సొంత ఎమ్మెల్యేలు సైతం తలోదారి పడుతున్నారని తీవ్రంగా దుయ్యబట్టారు. ప్రజావ్యతిరేక విధానాలతో ఇష్టారాజ్యాంగ తమ సొంత ప్రయోజనాలకే చేపడుతున్న కార్యక్రమాలతో అన్ని వర్గాల ప్రజలు అతలాకుతలం అవుతున్నారని అందుకోసం అన్ని వర్గాల ప్రజలు నడుంబిగించి టిడిపి. జనసేన ఉమ్మడిగా కలిసి పనిచేసి ప్రజలకు వెలుగునిద్దామని అందుకోసమే నేటి ఈ భోగి ద్వారా అందరికి పిలుపునిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం లో జనసేన టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జీ కణితి కిరణ్‌కుమార్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన

గోవిందరాజులు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బోయిన రమేష్, బగాది శేషు, జీరు భీమారావు, పినకాన అంజయ్‌కుమార్, టెక్కలి తెలుగుమహిళ అధ్యక్షులు పూజారి శైలజ, మాజీ ఎంపీపీలు తర్ర రామక్రిష్ణ, వెలమల విజయలక్ష్మి, ఎల్ఎల్. నాయుడు, కర్రి అప్పారావు, బాడాన రమణమ్మ, గొండు లక్ష్మణరావు, పట్ట సింహాచలం, సొసుమంతు అనందరావు, హనుమంతు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సైకత శిల్పం



విశాలాంధ్ర-ఆమదాలవలస: గాజుల కొల్లివలస పంచాయతీ పరిధి సంగమేశ్వర ఆలయం వద్ద గొర్లెల హరికృష్ణ సంక్రాంతి ని పురస్కరించుకొని సైకిత శిల్పాన్ని ఆదివారం నిర్మాణం చేశారు. సంక్రాంతి హరిదాసు, సంక్రాంతి శోభ రైతులు పండించే పంటలు అన్ని మేళవించిన సైకిత శిల్పాన్ని హరికృష్ణ నిర్మించారు. ఈ కొండ వద్ద సంక్రాంతి ని పురస్కరించుకొని మూడు రోజులపాటు జాతర జరుగుతుంది. సకల శుభాలు కలిగే విధంగా సైకిత శిల్ప నిర్మాణం జరిగింది. జాతరకు వచ్చేవారికి కనువిందు చేసే విధంగా ఈ సైకిత శిల్ప నిర్మాణం జరిగింది. మూడు రోజులు పాటు యువత ఈ శిల్పం వద్ద సెల్ఫీలు తీసుకుని ఆనందాన్ని పొందుతారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

విశాలాంధ్ర-సోంపేట: 1995-96 పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు 23 ఏళ్ల తరువాత ఒకచోట కలుసుకొని ఆత్మీయ సమ్మెళనం ఆదివారం నిర్వహించారు. సోంపేట సమీపంలో సీతయ్య ఫౌండేషన్ వృద్ధాశ్రమం ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. వృద్ధాశ్రమానికి తమ వంతుగా సహకారం అందిస్తామని తెలిపారు.

అశ్వవాహనంపై ఊరేగిన శ్రీవెంకటేశ్వరస్వామి

విశాలాంధ్ర -సారవకోట/జలుమూరు: మండలంలోని చీడిపూడి గ్రామకల్యాణ వెంకటేశ్వరస్వామివారి ఊరేగింపు కార్యక్రమం నేత్రపర్వంగా జరిగింది. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరుని అశ్వవాహనంపై బుడితి, అవలింగి, చీడిపూడి గ్రామాల్లో శనివారం రాత్రి ఊరేగించారు. మేళతాళాలతో సందడిగా, నేత్రపర్వంగా ఈ కార్యక్రమం జరిగింది. వందలాది మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా భోగి మంటలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : తెలుగు వారి సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బోగి పండుగ స్టార్ వాకర్ స్ క్లబ్ అధ్యక్షుడు బి వి. రవిశంకర్ అన్నారు. ఆదివారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్ స్ క్లబ్ ఆధ్వర్యంలో సంప్రదాయ రీతిలో బోగి పండుగ నిర్వహించారు. ముందుగా శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి వాకర్ స్ క్లబ్ వ్యవస్థాపకులు ఇందిరా ప్రసాద్ దంపతులు బోగి మంట ప్రారంభించారు. అనంతరం నడక సంఘాల సభ్యులు అంతా సంప్రదాయ రీతిలో నృత్యాలు చేస్తూ జై శ్రీరామ్ జై జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. బోగి పండుగ విశిష్టత గురించి పలువురు పెద్దలు వివరించారు.. బోగ బాగ్యాలను ఇచ్చే బోగి పండుగ శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఆంధ్రులు నిర్వహించుకునే ప్రధాన పండగల్లో బోగి కు ఒక ప్రత్యేకత ఉంది. నేటి నుండి సంక్రాంతి సందడి నెలకొంది. సంక్రాంతి పండుగల్లో మొదటరోజును బోగి అంటాము. దక్షిణాయనంలో సూర్యుడు రోజురోజుకూ భూమికి దక్షిణ వైపుగా కొద్ది కొద్దిగా దూరం అవుతుండటం వల్ల చలి బాగా అధికం అవుతుంది. ఈ వాతావరణాన్ని తట్టుకునేందుకు బోగి పిడకలతో బగ బగ మండే మంటలను ఏర్పాటు చేసి చలి నుండి ఉపశమనం పొందుతారు. ఈ సంప్రదాయం అనాధి నుండి వస్తుంది. శ్రీకాకుళం నగరంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే భారీ బోగి పండుగ కు శ్రీకాకుళం నగరంలో ఉన్న నడక సంఘాల సభ్యులు అంతా హాజరయ్యారు. ఈ సంబరా ల్లో నడక సంఘాల నాయకులు కూన వెంకట రమణ మూర్తి,శాస పు జోగి నాయుడు, బి. దేవీప్రసాద్, గోలీ ఉమా మహేశ్వర రావు ,గోలీ సంతోష్, ఎం. మల్లి బాబు, నాగేశ్వర ఈశ్వరరావు, వై. మోహన్ అందవరపు జ్యోతిర్మయి గేదెల లక్ష్మీ వాసంతి తదతరులు పాల్గొన్నారు. పాడి పంటలు ఇంటికి చేరిన సందర్భంగా రైతులు ఎంతో ఆనందమగా జరుపుకొనే పండుగ బోగి సంక్రాంతి అని చెప్పవచ్చు. బగ బగ బోగి మంటలతో సిక్కోలు జిల్లాలో ఊరూరా కొత్త కాంతులు కనిపించాయి.

కోటబొమ్మాళి : మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం బోగి మంటలు వెలుతురులతో గ్రామాలు కళకళలాడాయి. ఈ పండుగ నాడు తెల్లవారు జామునే యువకులు, పెద్దలు కలసి వీధుల్లో బోగిమంటలు వేశారు. యువకులు ఈ పండుగ కోసం గత వారం రోజులు ముందుగానే కట్టెలు, పిడకలు సేకరించి, ఈ బోగిమంటలో వేశారు. మహిళలైతే ఉదయాన్నే తలస్నానం చేసి కొత్తబట్టలు ధరించి బోగి దండలను మంటలో వేసి భక్తి శ్రద్ధలతో నమస్కరిస్తారు. మండలంలోగల ఊడికలపాడు, కోటబొమ్మాళి, దంత, కురుడు, హరిశ్చంద్ర పురం, లఖందిడ్డి, గంగరాం, యలమంచిలి, పాకివలస,

శ్రీజగన్నాథపురం, నిమ్మాడ, తిలారు తదితర గ్రామాల్లో ఘనంగా బోగి పండగ నిర్వహించారు. అలాగే స్థానిక శ్రీ కొత్తమ్మతల్లి ఆలయంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి వాకచర్ల రాధాక్రిష్ణ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు బోగి మంటలు, ముగ్గులు వేసి సందడిగా గడిపారు.

కవిటి: మండలంలోని ప్రజలు భోగి పండగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈమేరకు ఆదివారం భోగి పండగ వేడుకలు పురస్కరించుకొని గ్రామాలలో భోగి మంటల కాంతులు విరజిమ్మాయి.తమ కష్టాలను తొలగించాలని ప్రజలు అగ్ని దేవుడిని ప్రార్థించారు. తెల్లవారుజాము నుంచే భోగి మంటలతో ఇండ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేస్తూ చిన్నాపెద్దా తేడా లేకుండా సందడి చేశారు. దక్షిణాయనంలో పడ్డ కష్టాలు,బాధలను భోగి మంటల రూపంలో అగ్ని దేవుడికి సమర్పించి రాబోయే ఉత్తరాయణ కాలంలో సుఖసంతోషాలను ప్రసాదించాలనే పరమార్థమే భోగి పండుగ విశిష్టత.ఈ భోగి పండుగ వస్తూవస్తూ ఏడాదికి సరిపడా ధాన్యాన్ని వెంటతెస్తుంది.భోగ భాగ్యాలు ప్రసాదించే పండుగతోనే సంబరాలు మొదలవుతాయి. గ్రామాలలో భోగి పండుగ సందర్భంగా యువత ఆనందోత్సవాలతో జరుపుకున్నారు.

కొత్తూరు... మండలం కర్లెమ్మ గ్రామంలో ఆదివారం చీకటి తెరలు విడకముందే గ్రామ పెద్దలు భోగి మంటలు వేసి మూడురోజుల సంక్రాంతి పండగ వేడుకలకు తెరలేపారు. రిటైర్డ్ హెచ్.ఎం. యెద్దు దాసునాయుడు, టీడీపీ మండల మాజీ అధ్యక్షులు వై.దాసునాయుడు, తదితర పెద్దలు గ్రామస్థులు పాల్గొన్నారు. కాగా మండలంలోని భోగి మంటలతో సంక్రాంతి వెడుకులుకు శ్రీకారం చుట్టారు.

ప్రజలకు ఎమ్మెల్యే సంక్రాంతి శుభాకాంక్షలు

విశాలాంధ్ర- హిరమండలం: పాతపట్నం నియోజకవర్గంలోని బీసిలు, మైనారిటీ ప్రజలకు, ఎస్సిలు, ఎస్టీలు, ఓసి ప్రజలకు, నాయకులకు, వైస్సార్సీపీ కార్యకర్తలకు, పేరుపేరునా పాతపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆదివారం సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ ప్రజలంతా ఘనంగా సంక్రాంతి వేడుకలు జరుపుకోవాలని, సుఖసంతోషా లతో జీవించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మళ్ళీ ఎమ్మెల్యేగా పాతపట్నం నియోజకవర్గంలో నేను పోటీ చేస్తున్నానని, నా అభిమానులందరూ నన్ను అత్యధిక మెజారిటీతో గెలిపించి మళ్ళీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేయాలని పిలుపునిచ్చారు.

అంగన్వాడీలు గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : అంగన్వాడీ లకు జీతాలు పెంచాలని, తమ న్యాయ మైన డిమాండ్లు పరిష్క రించాలని కోరుతూ కోటబొమ్మాళి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గల సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాలకు చెందిన అంగన్వాడీ సిబ్బంది ఆదివారం గ్రామాల్లో కోటి సంతకాలు సేకరణ చేపట్టారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు చెల్లించాలని, రాష్ట్రంలో అంగన్‌వాడీలందరికీ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ. 5లక్షలు, వేతనంలో సంఘం పించన్ ఇవ్వాలని, హెల్పర్ల ప్రమోషన్‌కు వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేసి అన్ని యాప్‌లు కలిపి ఒకే యాప్‌గా మార్చాలని, సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, భీమా అమలు చేయాలని తదితర డిమాండ్‌లును ప్రభుత్వం చెల్లించాలని అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు హనుమంతు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

224 మందికి పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర-పలాస : పలాస సంఘంలో ఆదివారం పలాసకు చెందిన నిరుపేద వైశ్య కుటుంబాలకు పలాస వైశ్య సంఘం ఆధ్వర్యంలో 224 మంది నిరుపేద కుటుంబాలకు 1200 రూపాయలు విలువ చేసే దుస్తులు, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలాస వైశ్య సంఘం అధ్యక్షులు మల్లా క్రిష్ణారావు, కార్యదర్శి తంగుడు వైకుంతరావు, కోశాధికారి పి.వి.సతీష్‌లు మాట్లాడుతూ ప్రతి ఏడాది నిరుపేద వైశ్య కుటుంబాలకు ఆదుకోవాలనే ఉద్దేశంతో నిత్యవసర సరుకులతో పాటు దుస్తులు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైశ్య సంఘం మాజీ అధ్యక్షులు మల్లా భాస్కరరావు, మహిళా సంఘం అధ్యక్షులు మల్లా సౌజన్య, యువజన సంఘ అధ్యక్షులు మల్లా గణేష్, దోకి నాగేశ్వరరావు, మల్లా సూర్యనారాయణ గుప్తాలు కోట్ని శశికుమార్, తంగుడు కామేశ్వరరావులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడంతో పర్యావరణ పరిరక్షణ

విశాలాంధ్ర-మందస: నేటి పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, అందు కోసం ప్రతీ ఒక్కరు విధిగా మొక్కలు నాటాలని వాణిజ్య పన్నుల శాఖ ఉప సహాయ కమిషనర్ బడియా కామరాజు అన్నారు. ఆదివారం బోగి పండగను పురస్కరించుకొని కొత్తపల్లి గ్రామంలో అంబేద్కర్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని, నాటిన మొక్కలు సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో సేనాపతి మురళీ, పి.ప్రకాశరావు, బి.పాపారావు, మందస ఎంఇవో-2 ఎం.భాస్కరరావు, గవ్వ భీమారావు, పి.రాజా, పి.బాలరాజులు పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో లక్షమందితో తూర్పు కాపు గర్జన

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: ఎన్నో ఎన్నెన్నో దశాబ్దాలు గడుస్తున్నా దశ మారని దారిద్ర్య జీవనం గడుపుతున్న తూర్పు కాపు సామాజిక వర్గం అంతా ఐక్యమై ఫిబ్రవరి నెల మొదటి వారంలో శ్రీకాకుళం నగరంలో లక్షమంది తో తూర్పు కాపు గర్జన పేరుతో భారీ సదస్సు ఏర్పాటు చేస్తామని తూర్పు కాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు సూరంగి మోహనరావు, డోల జగన్మోహన్ రావు, శాసపు జోగి నాయుడు, ఆనేపు రామకృష్ణ, లుకలాపు రవి, గేదెల శంకరరావు, లంక గాంధీ, లోలుగు వెంకట రాజశేఖర్, ఎం. శంకర్ నారాయణలు తెలిపారు. ఆదివారం శ్రీకాకుళం నగరంలో తూర్పు కాపు భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, విద్యాపరంగా ఉద్యోగ పర్వముగా తూర్పు కాపు జాతి వెనుకబడి ఉందని ఈ కారణం వల్ల తూర్పు కాపు జాతి దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడు తుం దని ఈ స్థితి నుండి బయట పడాలంటే ఒక్క రాజకీయ అధికార సాధన ముఖ్యమని భావించి ఈ గర్జన సభ ఏర్పాటు చేశామని చెప్పారు. శ్రీకాకుళం జిల్లా జనాభాలో దాదాపు ఎనిమిది లక్షల జనాభా ఉన్న అతిపెద్ద కులం తూర్పు కాపులని గత 20 ఏళ్లుగా అన్ని ప్రభుత్వాలు కాపులను నిర్లక్ష ధోరణులతో చూస్తున్నారని ఈ పరిస్థితుల నేపథ్యంలో విధి లేని పరిస్థితుల్లో ఈ గర్జన ఏర్పాటు చేసి అధికార ప్రతిపక్ష పార్టీ లకు మా కులం తడాఖా చూపిస్తామని వారు హెచ్చరించారు. రాజకీయా లకు వర్గ వైషమ్యాలకు అతీతంగా జరుగుతున్న ఈ సదస్సుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన వారు అంతా హాజరు కావాలని వారు కోరారు. జాతిలో ఐక్యతకు ప్రతీకగా నిలిచే ఈ సదస్సు నిర్వహణకు సంబంధించి మండల స్థాయి కమిటీలు వారం రోజుల్లో పూర్తి చేయుటకు నిర్ణయం తీసుకున్నారు. ఇంతవరకు అన్ని రాజకీయ పార్టీలు తూర్పు కాపుల సహనాన్ని ఓర్పు నేర్పు చూసారు ఇకపై న్యాయమైన డిమాండ్ల సాధన కొరకు ఉద్యమాలు చూస్తారని హెచ్చరించారు. శ్రీకాకుళం జిల్లాలో ఉన్న జనాభా ప్రాతిపదికన ఎం ఎల్ ఏ ,ఎం పీ సీట్లు కేటాయింపులు చేయాలని వారు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తూర్పు కాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు కిల్లారి నారాయణ రావు, కురి టి దుర్గారావు , దువ్వు కృష్ణారావు, తంకాల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తూర్పు కాపు జాతి ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. జై తూర్పు కాపు జై జై తూర్పు కాపు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

కనుల పండుగగా శ్రీగోదా రంగనాథ స్వామివారి కళ్యాణం

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని బెజ్జిపుట్టుగ శ్రీ చక్రపెరుమాళ్ళస్వామి ఆలయంలో అర్చకులు సత్యం స్వామి,రాజుస్వామి,రాజేష్ స్వామి, ఆధ్వర్యంలో గోదా కళ్యాణం కనుల పండుగగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేపట్టి వేకువజాము నుండి అర్చకులు సత్యం స్వామి, రాజు స్వామి,రాజేష్ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగ్గా అర్చకులు మాట్లాడుతూ ధనుర్మాసం విష్ణువికి చాలా ప్రత్యేకమైనది. ధనుర్మాసం నెల రోజులపాటు సుప్రభాతం బదులు తిరుప్పావై గానం చేస్తారు. సహస్రనామార్చనలో తులసీదళాలకు బదులు బిల్వపత్రాలను ఉపయోగిస్తారు.విష్ణు ఆలయాలల్లో ఉదయం అర్చనలు చేసి నివేదనలు చేసి వాటిని పిల్లలకు పంచుతారు.ఇలా చేయడాన్ని బాలభోగం అంటారు. ధనుర్మాసంలో ఉదయం,సాయంత్రం దీపారాధన చేయడం వల్ల లక్ష్మీదేవి అనుగ్రహంతో పాటు,దరిద్రం దూరమవుతుందని తెలిపారు.ఈ నెలలో ప్రతిరోజు బ్రహ్మ ముహూర్తంలో పారాయణం చేసిన వారు దైవానుగ్రహానికి పాత్రులవుతారని ప్రతీతి. భూదేవి, అవతారమైన అండాళ్ రచించిన దివ్య ప్రబంధమే తిరుప్పావై అన్నారు.ద్రావిడ భాషలో తిరు అంటే పవిత్రమైనది, పావై అంటే వ్రతం అని అర్థం.ధనుర్మాసంలో విష్ణువును మధుసూధనుడు అనే పేరుతో పూజించి,మొదటి పదిహేను రోజులు చక్కెర పొంగలి లేదా పులగం స్వామికి నైవేద్యంగా సమర్పించాలి. తర్వాత పదిహేను రోజులు దద్యోజనం అర్పించాలి. పెళ్లికాని అమ్మాయిలు ఇంటి ముందు ముగ్గులు,గొబ్బిళ్లతో పూజలు చేయటం వల్ల తాము కోరిన వరుడు లభిస్తాడు అన్నారు.గోదాదేవి మార్గళి వ్రతం పేరుతో విష్ణువును ధనుర్మాసమంతా పూజించింది. శ్రీకృష్ణుని ధనుర్మాసం నెలరోజులూ తులసీ మాల సమర్పించే యువతులకు, నచ్చిన వరునితో వివాహం జరుగుతుంది.ధనుర్మాస వ్రతం దీని గురించి మొదట బ్రహ్మదేవుడు నారద మహర్షికి వివరించినట్లు పురాణ కథనం. ధనుర్మాస వ్రతం గురించి బ్రహ్మాండ,ఆదిత్య పురాణాల్లో, భాగవతంలో, నారాయణ సంహితలో కనిపిస్తాయి. ఈ వ్రతం ఆచరించాలనుకునేవాళ్లు తమ స్థోమతను బట్టి విష్ణు

ప్రతిమని చేయించి పూజించాలి. ప్రతిరోజూ సూర్యోదయానికి ముందే స్నానాలు పూర్తిచేయాలి. పంచామృతాలతో మహావిష్ణువును అభిషేకించి తర్వాత తులసీ దళాలు, పూలతో అష్టోత్తర సహస్రనామాలతో స్వామిని పూజించి నైవేద్యం సమర్పించాలి. నెలరోజులూ చేయలేనివాళ్లు 15 రోజులు,8 రోజులు లేదా ఒక్క రోజైనా చేయవచ్చు. ధనుర్మాస వ్రతం చేయడం వల్ల ఇహలోక సుఖాలు,పరలోక మోక్షం పొందుతారు. ఆత్మ పరమాత్మను చేరడానికి ఉపకరించేదే ధనుర్మాస వ్రతం.ప్రాచీన కాలం నుంచి భారతీయులందరూ ఈ వత్రాన్ని ఆచరిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పొందల కుమారి కృష్ణారావు, రాంబాబు సుప్రియ దంపతులతో పాటు చుట్టుపక్కల గ్రామాల మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాల్సిందే

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : ఎటువంటి చర్చ లేకుండా అకస్మాతుగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం పేద బడుగు బలహీన వర్గాల నెత్తిన గుడి బండ అని న్యాయవాదులు ఆవేదన వ్యక్తం చేసారు. ఐ.ఏ.ఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగరాజ్ పాత్రో ఆధ్వర్యంలో స్థానిక న్యాయవాదులు ఆదివారం మరోసారి తమ నిరసన వ్యక్తం చేసారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూ హక్కు చట్టానికి మూలమైన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ జి.ఓ ప్రతులను దగ్ధం చేసారు. ఈ సందర్భంగా నాగరాజ్ పాత్రో పాటు ఇతర న్యాయవాదులు ఎం. సోమశేఖర్, ఎస్.ఎల్ నారాయణ, ఎన్.రమణయ్య, గిన్ని సీతయ్య, ఎం.కె. సామంత్‌లు మాట్లాడుతు చెడును దహించి, మంచిని తెచ్చేదిగా భావించే భోగి పర్వదినం సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు సృష్టించే ప్రభుత్వ జి.ఓ 512 కాపీలను భోగి మంటలో వేసి, మేలు జరగాలని కోరుకుంటున్నామని అన్నారు. పెత్తందార్లకు అండగా రాజకీయ పక్షాల ప్రమేయంతో రెవిన్యూ అధికారులకే పెత్తం కట్టబెడుతు తెరమీదకు తెచ్చిన చట్టం వల్ల రాష్ట్ర ప్రజలు మానసిక, ఆర్థిక, ఆస్థి నష్టాలు చవిచూడాల్సి వస్తుందని, అధికారం అడ్డం పెట్టుకుని హుకుం చేసే వారిదే పై చేయి అయి, ప్రజలకు రక్షణ కల్పిస్తున్న కోర్టులు కూడా మౌనంగా ఉండిపోవాల్సిన దయనీయ పరిస్థితులను సృష్టించే నిర్ణయం సరైంది కాదని తక్షణం సంబంధిత జి.ఓను ఉపసంహరించుకుని, యాక్టును రద్దు చేయాలని నాగరాజ్ పాత్రో డిమాండ్ చేసారు.

విజేతగా వై.ఆర్.సి.సి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : మండపల్లి తోటూరు గ్రామంలో చిదంబరేశ్వర క్రికెట్ అసోసియేషన్ నిర్వహించిన పోటీల్లో వై.ఆర్.సి.సి టీం విజేతగా నిలిచింది. సి.సి.సి టీం రన్నర్స్‌గా నిచిలింది. ఈ సందర్భంగా విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న తెలుగు యువత నియోజవర్గ అధ్యక్షుడు కాళ్ళ జయదేవ్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త దాసరి రాజు తదితర వక్తలు మాట్లడుతు ప్రజాదరణ గల క్రికెట్ క్రీడలో రాణించడం ద్వారా మెరుగైన అవకాశాలు ఈ ప్రాంత క్రీడాకారులు అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు.

సంక్రాంతికి నకిలీ మద్యం జోరు..!

- ఒడిస్సా నుంచి నాటు దిగుమతి
- కల్తీతో మద్యం ప్రియులు వేతలు
- కల్తీకి బెల్ట్ షాపులే అడ్డా
- కాసుల కక్కుర్తిలో ఎక్సైజ్
- చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు

విశాలాంధ్ర-ఆమదాలవలస : పండగలు వస్తే చాలు మందుబాబులు విచ్చలవిడిగా మద్యం సేవించి తెగ సంబర పడిపోతుంటారు. దీన్ని ఆసరాగా చేసుకుని మద్యం విక్రయదారులు కల్తీ మద్యాన్ని విక్రయించి మందు బాబులను మోసగి స్తున్నారు. సమయపాలన లేకుండా బార్లు నిత్యం వారి అనుయాయుల ద్వారా విక్ర యాలు చేస్తూ ఉంటారు. రైల్వే స్టేషన్ వద్ద ఉన్న ప్రైవేట్ మద్యం దుకాణాల్లో కల్తీలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిసింది. అయితే పంత మంది ద్వారా ప్రయాణికులకు బయటే విక్రయిస్తుంటారు. సీసాలో కల్తీ కలిపి మద్యం ప్రియులను మోసం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒరిస్సా నుంచి నాటు సారాను దిగుమతి చేసి విక్రయాలు సజావుగా సాగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. బెల్ట్ షాపు లు వద్ద నకిలీ మద్యం విక్రయాలు సజావుగా సాగుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. నకిలీ మద్యానికి అడ్డాగా బెల్ట్ షాపులు మారాయ ని మందుబాబులు వాపోతున్నారు. మద్యం ప్రియుల అలవాటును ఆసరాగా చేసుకుని విక్రయదారులు రెచ్చిపోయి విక్రయాలు చేస్తున్నారు. వీటిని స్థానికంగా పరిశీలించి రోజువారి వసూళ్లలో ఓ ఎక్సైజ్ అధికారి పూర్తిగా నిమగ్నమయ్యారని ఆముదాల వలస లో ఏ మందు బాబుని ముట్టుకున్న అదే స్వరం వినిపిస్తుంది. సరుబుజ్జిలి, ఎల్ ఎన్ పేట, బూర్జ కొండ ప్రాంతాల నుంచి నాటును దిగుమతి చేసి బెల్ట్ షాపులు వద్ద తెల్లవారుజాము నుంచే మద్యం ప్రియులకు విక్రయిస్తుంటారు. ఒక్క ఆముదాలవలస పట్టణంలోనే 80 బెల్ట్ షాపులు ఉన్నాయంటే ఆశ్చర్యం కలిగిస్తుంది. ప్రభుత్వ మద్యం విక్రయాల్లో 130 రూపాయలు మద్యం బాటిల్ను బ్లాక్ చేసి అధిక ధరలకు బెల్ట్ షాపులు కనిపిస్తున్నట్లు తెలిసింది. బెల్ట్ షాపులు నిషేదిస్తామని ప్రభుత్వం ఊదర గొట్టుడు ఉపన్యాసాలు ఇచ్చినప్పటికీ ప్రతీ చోట బెల్ట్ షాపులె దర్శనమిస్తాయి. మందు బాబులు వేపూజము నుంచే ఈ షాపుల వద్ద క్యూ కడుతుంటారు. కొండ ప్రాంతాల నుంచి మద్యం క్యాన్ లతో ప్రైవేటు వాహనాల ద్వారా దిగుమతి చేసి బెల్ట్ షాపులకు అంది స్తున్నట్లు తెలిసింది. ఇటీవల ఆముదాలవ లస లో నకిలీ మద్యం తయారీలో యావత్ రాష్ట్రాన్ని ఆశ్చర్యానికి గురి చేసింది. ఇటీవల కోటబొమ్మాళి ఇచ్ఛాపురంలో కల్తీ మద్యం

విచ్చలవిడిగా విక్రయాలు జరుగుతున్నట్లు అందుకు బాధ్యులైన కొందరిని ఉన్నతాధి కారులు తప్పించినట్లు కూడా తెలిసిందే. ఇటీవల జిల్లా పోలీసు ఉన్నతాధికారి పాతపట్నం చెక్ పోస్ట్ వద్ద విస్తృత స్థాయి తనిఖీలు చేసి ఇటువంటి వాహనాలకు అడ్డుకట్టు వేశారు. అయినప్పటికీ దొంగ దారులు వెతుక్కుని సంక్రాంతికి నకిలీ సరుకును సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. ఏది ఏమైనప్పటికీ ప్రభుత్వ ఆదాయం కుంటుపడే విధంగా నకిలీ విక్రయాలు జరుగుతుంటే ఉన్నతాధికారులు చర్యలు ఎందుకు చేపట్టడం లేదని మద్యం ప్రియుల ముక్తకంఠంతో అంటున్నారు. ఈ విషయమై ఆముదాలవలస ఎస్ ఇ బి (ఎక్సైజ్ సిఐ) ను వివరణ కోరగా షాపులను తనిఖీ చేసే అధికారం మాకు లేదని బయట ఎవరైనా విక్రయిస్తున్నట్లు దొరికితే అదుపు లోకి తీసుకొని విచారణ చేస్తామని తెలిపారు. దీనికి ప్రత్యేక బృందాలు ఉన్నాయని ఆయన సెలవిచ్చారు.